లేక్ వ్యూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన లేక్ వ్యూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

నిజాంపేట్: ప్రగతి గనర్ లేక్ వ్యూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి తొలి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రమేష్ అధ్యక్షత వహించారు. కాలనీ అభివృద్ధికి సంబంధించి పలు కీలక అంశాలపై చర్చించారు. అసోసియేషన్ ఎన్నికల ద్వారా కార్యవర్గ సభ్యులుగా పలువురు ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా రమేష్, ఉపాధ్యక్షులుగా గోవిందరాజులు, శాస్త్రీ, ప్రధాన కార్యదర్శిగా సంజయ్, కార్యదర్శులుగా డా.ప్రశాంత్, శ్రీకాంత్, కోశాధికారిగా సుబ్బారావు, సంయుక్త కార్యదర్శిగా కల్యాణ్ ఎన్నియ్యారు. సమావేశంలో కాలనీ అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాల్సిన అంశాలు, భద్రతా ఏర్పాట్లు, దోమల నివారణ చర్యలు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, అంబీర్ చెరువు సుందరీకరణ తదితర అంశాలపై చర్చించారు. అసోసియేషన్ ఏర్పాటుకు సంఘీభావంగా పలు అపార్ట్‌మెంట్‌కు చెందిన అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సింహపురి కాలనీ చెరువు పరిశీలన



నిజాంపేట్: సింహపురి కాలనీ చెరువుని ఆకుల సతీష్ స్థానిక ప్రజలతో కలిసి ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువుని అభివృద్ధి చేయాలని మున్సిపల్ కమిషనర్, మల్కాజిగిరి ఆర్డీఓ, ఇరిగేషన్ డీఈ దృష్టికి తీసుకెళ్లారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట గ్రామం సింహపురి కాలనీలో బలిజవానికుంట ఉందన్నారు. నాలాను పూడ్చి కొందరు కాంపౌండ్ వాల్ నిర్మించడం వల్ల నీళ్లు వెళ్లకపోవడంతో దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సర్వే నంబర్ 450లో ప్రభుత్వ భూమి 3.20 ఎకరాల్లో చెరువు విస్తీర్ణం పోను మిగతా ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేయాలన్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ సరిహద్దులను ఏర్పాటు చేసి, మిగిలిన ప్రభుత్వ స్థలంలో పార్క్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అరుణ్‌రావు, చందు, అశోక్ రెడ్డి, రామ్‌కుమార్, సత్యనారాయణరెడ్డి, రవీంద్ర, శేషు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్



జయభేరి కాలనీలో వరద పరిస్థితిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి

కుత్బుల్లాపూర్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ఆదివారం ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యంగా జయభేరి కాలనీలో రోడ్డుపై చేరిన నీరు పలు ఇళ్లల్లోకి వెళ్తుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో సెల్లార్‌లోకి వర్షపు నీరు వెళ్లినట్లు గుర్తించారు. రాబోయే రోజుల్లో వర్షం నీరు నిల్వకుండా శాశ్వత పరిష్కారం చూపే విధంగా ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

మణికొండ: పేదలను దృష్టిలో ఉంచుకుని నిర్వహించే సేవా కార్యక్రమాలు నిర్వాహకులకు మానసికంగా ఎంతో తృప్తినిస్తాయని మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కె. నరేందర్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం లలిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీరాంనగర్ కమ్యూనిటీ హాల్‌లో పేదలకు నిత్యావసర సరుకులను ఆయన పంపిణీ చేశారు. ఫౌండేషన్ నిర్వాహకులతో పాటు కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ఎం.జితేందర్, మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉమ్రా బయలుదేరిన యాత్రికులు

శంషాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు చెందిన మరో యాభైమంది యాత్రికుల బృందం ఆదివారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఉమ్రా యాత్రకు బయలుదేరారు. శంషాబాద్ విమానాశ్రయంలో యాత్రికులకు వారి కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు పూలమాలలతో సత్కరించి యాత్ర సజావుగా సాగాలని శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్రా యాత్రను అల్‌మిజాన్ సంస్థ నిర్వాహకులు ఫయాజ్ అలీ పర్యవేక్షిస్తున్నారు.

అమ్మకు ప్రణమిల్లి..

శేరిలింగంపల్లి జంట సర్కిళ్లలో ఘనంగా బోనాలు



తారానగర్‌లో భక్తులు భారీ ఊరేగింపుగా వస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి జోన్ బృందం: ఆషాఢమాస బోనాలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మియాపూర్, చందానగర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్లలోని కాలనీలు, బస్తీలలో వెలసిన పోచమ్మ మైసమ్మ, పెద్దమ్మ, ఊరపోచమ్మ, కాళికాదేవి, తుల్జాభవానిమాత, దుర్గామాత, అన్నపూర్ణా దేవి, రాజరాజేశ్వరి మాత,రేణుకా ఎల్లమ్మ అమ్మవార్ల ఆలయాలు భక్తులతో ఉదయం నుంచి కిటకిటలాడాయి. తెల్లవారుజామునే ఆలయాలను రకరకాల పూలు, విద్యుత్‌దీపాలు, మామిడి ఆకులు, వేప ఆకులతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. భక్తి శ్రద్ధలతో మహిళలు తమ ఇళ్ళ నుంచి అమ్మవారికి బోనం ఎత్తుకొచ్చి సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కాగా బోనం, తొట్టెల సమర్పణ కోసంవచ్చే భక్తుల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, అమ్మవారికి జయజయధ్వానాల చేస్తూ వెళ్ళడం అందరికీ భక్తిపారవశ్యంలో ముంచెత్తేలా చేశాయి.



తారానగర్‌లో పోతురాజుల విన్యాసాలు



రాయదుర్గంలోని శ్యామ్‌లెట్ వీధిలోని ఊరపోచమ్మ అమ్మ వారికి ప్రత్యేక అలంకారం



నానక్‌రాంగూడలోని పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సినీ నటుడు నరేష్‌ను సన్మానించిన స్థానికులు, ఆలయ నిర్వాహకులు, అర్చకులు



జీపీఆర్ఏక్వార్టర్స్‌లోని ఆలయంలో..



నానక్‌రాంగూడలో..



మియాపూర్‌లో కార్పొరేటర్ ఉప్పలపాటిశ్రీకాంత్, ఆలయ నిర్వాహకులు



తారానగర్ పోచమ్మ దేవాలయం వద్ద ..



రాయదుర్గంలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



మియాపూర్ మక్తామహబూబ్‌పేట్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్ యాదవ్



కొండాపూర్ డివిజన్ మార్తండనగర్‌లో ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ

మ్యాన్‌హెల్స్

- ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు
- భయాందోళనలో ప్రజలు



మియాపూర్: మియాపూర్ రోడ్లపై మ్యాన్ హోల్స్ నోళ్లు తెరిచి ప్రమాదాలకు నిలయంగా మారాయి. మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎంఏనగర్ కాలనీ ప్రధాన రహదారిపై, బొల్లారం ఎక్స్‌రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై మ్యాన్‌హోళ్ల మూతలు లేకుండా దర్శనమిస్తున్నాయి. అసలే వర్షాకాలం చిన్నపాటి చినుకు రాలితే ప్రధాన రహదారిపై వర్షపునీరు వరదలై పారుతుంది. ఎక్కడ ఏ మ్యాన్‌హోల్ నోరుతెరుచుకుని ఉందో కూడా తెలియపరిస్థితి ఉంటుంది. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులకు పలుమార్లు చెప్పినా వినిపించుకోవడం లేదంటూ పలువురు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని మ్యాన్‌హోళ్ల మూతలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

తెలంగాణకు బీజేపీ చేసింది శూన్యం

- ఐఎన్‌టీయూసీ
- జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి

పటాన్‌చెరు: తెలంగాణకు బీజేపీ చేసింది శూన్యమని, మియాపూర్, పటాన్‌చెరు మెట్రో రెండవ దశ పొడిగింపులో కేంద్ర నిధులు తీసుకురావడంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పూర్తిగా విఫలమయ్యారని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి ఆరోపించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...కేంద్ర బీజేపీ మంత్రులు నాయకులు ఢిల్లీ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, ఔటర్‌రింగ్‌రోడ్డు, కంది ఐఐటీలను సందర్శిస్తున్నారని ఈ మూడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్మించిన ప్రాజెక్టు లేనని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణకు చేసింది శూన్యమన్నారు. హైదరాబాద్ మెట్రో రెండవ దశ పొడిగింపు ఏ, బీ కేటగిరీలో సుమారు రూ.40 వేల కోట్ల ఖర్చు అవుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వాటా 30% కేంద్ర బీజేపీ ప్రభుత్వ వాటా 18% ఉన్నప్పటికీ కేంద్రం నిధులు ఇవ్వకుండా తెలంగాణ అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. మెట్రో రైలు పొడిగింపు నిధులు తీసుకురావడంలో ఎంపీ రఘునందన్ రావు పూర్తిగా విఫలమయ్యారన్నారు విమర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు యువరాజ్, కార్మిక సంఘం నాయకులు అంజయ్య, రతన్‌సింగ్, మధు, శ్రీనివాస్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గచ్చిబౌలి: పీజీ హస్టల్‌లో ప్రమాద వశాత్తు విద్యుత్ వైర్ తాకడంతో ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న తెలిపిన మేరకు.. నెల్లూరు జిల్లా సీతారాంపురం మండలం గుండుపల్లి గ్రామానికి చెందిన రాచర్ల కొండల్ రావు(43) మూడేళ్లుగా రాయదుర్గంలోని మధురానగర్‌లో సాయిలక్ష్మీ బాలాజీ ఉమెన్స్ పీజీ హస్టల్‌ను నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఉదయం నీటితో పార్కింగ్‌లో కడుగుతూ డ్రమ్మును జరుపుతుండగా విద్యుత్ తాకింది. విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు సమీపంలోని ఓ ప్రైవేట్ హస్పిటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. భార్య నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చిత్రపురిలో నిధిఅగర్వాల్ పూజలు

మణికొండ: చిత్రపురి కాలనీలో ఆదివారం నిర్వహించిన కనకదుర్గ అమ్మవారి బోనాల ఉత్సవాల్లో ప్రముఖ సినీ హీరోయిన్ నిధి అగర్వాల్ ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలలో భాగంగా బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించటం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. తను హీరోయిన్‌గా నటించిన హరిహర వీరమల్లు సినిమా విజయవంతం కావాలని అమ్మవారికి పూజలు చేశానన్నారు. ఆర్‌టీఐ కమిషనర్ సృజన, పీవీ శ్రీనివాస్, ఫిల్మ్ చాంబర్ నాయకులు భరత్‌కుమార్, దామోదరప్రసాద్, ప్రసన్న కుమార్, సి.కల్యాణ్, భరద్వాజ్, ఎస్.శంకర్, స్థానిక నాయకులు పెద్ద ఎత్తున పూజలు, ఉత్సవాల్లో పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఎస్ఐ దశరథ్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. లైసెన్సులు లేకుండా రోడ్లపైకి వస్తే వాహనాలు సీజ్ చేస్తామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మైనర్లకు వాహనాలను ఇచ్చినవారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానికులు, వాహనదారులు పాల్గొన్నారు.



భారతదేశాన్ని విశ్వగురువుగా చేసే దిశలో ఉన్నాం



కార్యక్రమంలో పాల్గొన్న పీఠాధిపతులు, సాధులు, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు

రాయదుర్గం: భారతదేశాన్ని విశ్వ గురువుగా చేసే దిశలో ఉన్నామని మౌంట్‌ఆబూ బ్రహ్మకుమారీస్ సంస్థ సీనియర్ సభ్యురాలు రాజయోగిని ఉషాదీదీ స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో 'సాధు సమ్మేళనం, దివ్య సమర్పణ అభినందన సభ' కార్యక్రమాన్ని బ్రహ్మకుమారీస్ సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పీఠాధిపతులు, సాధులతో కలిసి శాంతిసరోవర్ డైరెక్టర్ బికెకుల్‌దీప్‌దీదీ, మౌంట్‌ఆబూ బ్రహ్మకుమారీ స్ సంస్థ సీనియర్ సభ్యురాలు రాజయోగిని ఉషాదీదీ జ్యోతి వెలిగించి సమావేశాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆహింసా పరమోధర్మ అని చాటి చెప్పిన సనాతన ధర్మాన్ని బ్రహ్మకుమా రీస్ సంస్థ సంపూర్ణంగా ఆచరిస్తుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సంస్థకు చెందిన పలువురు పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు పొగపై పోరు సెగ

- కొల్లూరు డంపింగ్‌యార్డ్ తరలించాలని ఉద్యమబాట
- గత ప్రభుత్వం 5ఎకరాల కేటాయింపు
- ఏర్పాటు నుంచి నిర్వహణ వరకు నిర్లక్ష్యమే



డంపింగ్ యార్డ్ ముందు ధర్నా చేస్తున్న సమీపంలోని తండా వాసులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరులోని డంపింగ్ యార్డ్‌ను తరలించాలని పరిసర ప్రాంతాల గ్రామస్తులు ఉద్యమం మొదలుపెట్టారు. గతంలో స్థానికంగా డంపింగ్‌యార్డ్ లేకపోవడంతో స్థానికులు, మున్సిపల్ సిబ్బంది సేకరించిన చెత్తను రోడ్లపైనే డంప్ చేసేవారు. దాంతో ప్రజలు ఇబ్బందులు పడటంతో గత ప్రభుత్వం డంపింగ్ యార్డ్‌కు 5ఎకరాలు కేటాయించింది. కాలనీల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌లో చెత్తను పోగుచేసి తగలబెట్టడంతో దాని తో వచ్చే పొగతో డంపింగ్ సమీపంలోని గ్రామస్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు డంపింగ్‌యార్డ్ నిర్వహణలో నిర్లక్ష్యం చూపటంతో ఈ సమస్య జఠిలంగా మారింది. దీంతో డంపింగ్‌యార్డ్‌కు సమీపంలోని రంగారెడ్డి జిల్లాకు చెందిన గ్రామాల ప్రజలు ఉద్యమబాట పట్టారు.

కోట్లాది రూపాయలతో సౌకర్యాలు

డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసిన తర్వాత గత పాలకులు రూ.కోటి నిధులతో ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను నిర్మించారు. రూ.50లక్షలతో కాంపోస్ట్ షెడ్, డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్‌ను నిర్మించారు. వీటిని పూర్తిస్థాయిలో వినియోగించకుండా కేవలం చెత్తను డంపింగ్ చేసి దానిని తగలబెట్టటంతో దాని నుంచి వచ్చే పొగ, దుర్వాసనతో స్థానిక ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు.

ఎందుకీ నిర్లక్ష్యం..

మొదటి నుంచి డంపింగ్ నిర్వహణ విషయంలో అధికారులు పూరిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి నిర్లక్ష్యం కారణంగానే వేలాది మంది ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. తడి, పొడి చెత్తపై ప్రజలల్లో అవగాహన కల్పించడంలో అధికారులు చొరవ చూపకపోవడం లేదని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. అవగాహన లేమితో తడి, పొడి చెత్తను కలిపి స్వచ్ఛ ఆటోలకు ఇస్తుంటే ఆ చెత్తను డంపింగ్‌యార్డ్‌లో డంప్ చేస్తుడటంతోనే దుర్వాసన వస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని తడి,పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి



డంపింగ్‌యార్డ్‌పై అధికారుల నిర్లక్ష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చెత్త నుంచి వచ్చే దుర్వాసన మా తండా వరకు వస్తుంది. అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. దీంతో సొంత ఇళ్లను వదిలి దూరప్రాంతాలకు వెళ్లవలసిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలి.

–శంకర్ నాయక్ , ఇరుకుంట తండా

చర్యలు తీసుకుంటాం



గత కొద్ది రోజల క్రితమే బదిలీపై తెల్లాపూర్ కమిషనర్‌గా వచ్చాను. వచ్చిన వెంటనే కొల్లూరు డంపింగ్ యార్డ్‌ను సందర్శించాను. అక్కడ తడి,పొడి చెత్త వేరే చేసే ప్రక్రియను మొదలుపెట్టాం. దీంతో పాటు వాటితో ఎరువులు తయారు చేసేందుకు బయో మైనింగ్ మెషీన్లను ఏర్పాటు చేశాం. దాని వలన దుర్వాసన వచ్చే అవకాశం లేదు.

–అజయ్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, తెల్లాపూర్